## క్లుప్తంగా

### నేడు మండల సమావేశం

గుంతకల్లు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులతో పాటు ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరుకావాలన్నారు.

### నేడు 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

శింగనమల: మండలంలోని మదిరేపల్లి, ఆకులేడు, రఘునాథపురం, లోలూరు గ్రామాల్లో మంగళవారం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ ,జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ట


అలంకరణలో కన్యకా పరమేశ్వరి

గార్లదిన్నె: మండల కేంద్రంలో ఆర్య వైశ్య సంఘం, యువజన సంఘం, సేవా సంఘం, ఆర్య వైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున 4–18 గంటలకు వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో యంత్ర ప్రతిష్ట, కలశ విగ్రహ ప్రతిష్ట, గోదర్శనం, జ్వాలా దర్శనం, బలిహరణం, పూర్ణాహుతి చేపట్టారు. ఆర్య వైశ్యులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### రేపు గుర్రప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట

పుట్లూరు: మండలంలోని తక్కళ్లపల్లిలో ఈ నెల 6న గుర్రప్పస్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో సోమవారం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టామన్నారు. 6వ తేదీ నిర్వహించే విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి భక్తులు హాజరు కావాలని కోరారు.

### దూదేకుల సేవా సంఘం అధ్యక్షుడుగా హుస్సేన్‌పీరా




తాడిపత్రిటౌన్: తాడిపత్రి దూదేకుల (నూర్‌బాషా) సేవా సంఘం అధ్యక్షుడిగా కోటేగంటి హుస్సూన్ పీరాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని పుట్లూరు రోడ్డులో ఉన్న దూదేకుల సేవాసంఘం కార్యాలయంలో సోమవారం సంఘం కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శిగా హుస్సేన్‌పీరా, కోశాధికారిగా మహబూబ్‌బాషా ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు మాట్లాడుతూ దూదేకుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

### 8 నుంచి ఉపాధి అధికారుల పర్యటన

పుట్లూరు: మండలంలో ఈ నెల 8నుంచి నేషనల్ లెవెల్ మానిటర్ టీం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ సిబ్బందితో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఈ నెల 8 నుంచి నేషనల్ లెవెల్ మానిటర్ టీం పర్యటన సందర్భంగా క్షేత్ర స్థాయిలో అన్ని రికార్డులను అందుబాటులో ఉంచాలన్నారు. ఏపీడీ పుల్లారెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

### కృష్ణాష్టమి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప

గుంతకల్లు రూరల్: త్రైత సిద్ధాంతం– ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకూ కృష్ణాష్టమి ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో సోమవారం రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప కమిటీ సభ్యులతో కలిసి ఆహ్వాన పత్రికలను ఆహ్వానించారు. అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్ఐ సూచించారు.

### జూదరుల అరెస్ట్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని బెంచికొట్టాలలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.8,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. అలాగే పట్టణంలోని ఆలూరు రోడ్ కరెంట్ ఆఫీసు వెనకాల మట్కా రాస్తున్న వెంకటేష్ అనే బీటర్‌ను అరెస్ట్ చేశామన్నారు. అతడి నుంచి రూ.7,550 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

# అంగన్‌వాడీలకు అద్దె కష్టాలు

- బాడుగల చెల్లింపులో తీవ్ర జాప్యం
- ఐదు నెలలుగా అందని గ్యాస్, కూరగాయల డబ్బు
- ఇబ్బందులు పడుతున్న అంగన్‌వాడీ టీచర్లు



తాడిపత్రిలోని ఐసీడీఎస్ కార్యాలయం

తాడిపత్రి రూరల్: ఐసీడీఎస్ తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలో అద్దె భవనాల్లో నడుపుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు బాడుగలు చెల్లించడంలో జాప్యం జరుగుతోంది. అన్ని సెంటర్లకూ కలిపి ప్రతి నెలా దాదాపు రూ.4లక్షల వరకూ బాడుగలు చెల్లించాల్సి ఉంటుంది. అధికారుల సమాచారం మేరకు బడ్జెట్ రూ.8 లక్షలు ఉంది. ఈ బడ్జెట్ రెండు నెలల బాడుగలకు సరిపోతుంది. బడ్జెట్ ఉన్నప్పుడు సకాలంలో బాడుగల చెల్లింపులో అధికారులు, సిబ్బంది ఎందుకు జాప్యం చేస్తున్నారో తెలియక అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు పరిధిలో 302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో ఎక్కువ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉంటున్నాయి. తాడిపత్రి పట్టణంలో మొత్తం 66 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అన్ని కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. సరాసరి ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.5 వేల బాడుగ ఉంది. మిగిలిన మండలాల్లో తక్కువ బాడుగలు ఉంటున్నాయి. ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రానికి బాడుగ చెల్లించాల్సి ఉంది. ఆలస్యంగా బాడుగలు పడుతుండటంతో చేతి నుంచి అంగన్‌వాడీ టీచర్లు చెల్లిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే గౌరవ వేతనం రూ.11,500 కాగా అందులో రూ.5 వేల వరకు బాడుగ రూపంలో చెల్లిస్తున్నారు. మిగిలిన రూ.6,500ల్లో కేంద్రాల్లోని చిన్నారులకు మెనూ ప్రకారం వంట వండటానికి గ్యాస్, కూరగాయలు, ఈవెంట్ల పేరుతో మరి కొంత మొత్తం ఖర్చు చేస్తున్నారు. వీటన్నింటికి పోనూ మిలిగే అరకొర మొత్తంతో ఇళ్లకు బాడుగలు, కుటుంబ పోషణ సరిపోవడం లేదని అంగన్‌వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బాడుగల్లో వ్యత్యాసం**

తాడిపత్రి పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరు చేస్తున్న బాడుగల విషయంలో వ్యత్యాసం ఉంటోందని టీచర్లు వాపోతున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అంగన్‌వాడీ కేంద్రాన్ని బట్టి రూ.6 వేల వరకు బాడుగ చెల్లించే అవకాశం ఉంది. పలువురు సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ టీచర్‌ను బట్టి బాడుగలను వేస్తూ మిగిలిన వారికి కోతలు విధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో సూపర్‌వైజర్‌గా పనిచేసిన దస్తగిరిమ్మ తీరుపై అంగన్‌వాడీ టీచర్లు మండిపడ్డారు. బాడుగల విషయంలో సూపర్‌వైజర్ పక్షపాత ధోరణికి విసిగిపోయిన అంగన్‌వాడీ టీచర్లు ఇటీవల కార్యాలయంలో సీడీపీఓ సాజిదాబేగం ఎదుట తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగారు. సూపర్‌వైజర్లను బదిలీ చేయాలని పట్టుబట్టారు. చివరికి సూపర్‌వైజర్‌ను సీడీపీఓ అంతర్గత బదిలీ చేయాల్సి వచ్చింది. నాలుగు రోజుల క్రితం మరికొంత మంది సూపర్‌వైజర్లను వివిధ ఆరోపణలపై అంతర్గత బదిలీలు చేయల్సిన పరిస్థితి ఏర్పడింది. అంగన్‌వాడీ కేంద్రాల బాడుగల్లో టీచర్లకు అనుకూలంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సీడీపీఓ హెచ్చరించారు.

**జాప్యం జరుగకుండా చూస్తా..**



అంగన్‌వాడీ సెంటర్లకు అద్దెల విషయంలో ఇకపై జాప్యం జరుగకుండా చూస్తా. బడ్జెట్ మేరకు బాడుగలు మంజూరు చేయిస్తా. మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన కూరగాయల బిల్లు, రెండు నెలల బాడుగల బిల్లును చేసి ట్రెజరీకి పంపా. టీహెచ్ఆర్‌కు సంబంధించిన బిల్లులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. – సాజిదాబేగం, సీడీపీఓ

### విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి విఫలం


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు నాగేంద్రకుమార్

శింగనమల: విద్యార్థుల సమస్యలు పరిష్కరిచండంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని, విద్యారులను కలువకుండా జీవోలు తీసుకువస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు నాగేంద్రకుమార్ మండిపడ్డారు. సోమవారం శింగనమలలోని దుర్గాంజనేయ కమ్యూనిటీ భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలపై త్వరలో ఉద్యమం చేపడుతామన్నారు. విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలను వెళ్లనియ్యకుండా కూటమి ప్రభుత్వం జీఓ తీసుకవచ్చిందన్నారు. ఈజీఓను వెనక్కుతీసుకోకపోతే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వైటి రమేష్, భంగి శివ, తరిమెల గిరి, రాచేపల్లి సూర్యప్రకాష్, భీమేష్, శివ, వెంకటేసు, వంశి, అరుణ్ రషీద్, నవీన్ ధనుష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అంటేనే మోసం


యాడికి మండం చింతలాంపల్లిలో రీకాలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు


గార్లదిన్నె మండలం మర్తాడులో రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


నార్పల మండలం దుర్గంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

యాడికి: చంద్రబాబు అంటేనే మోసమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ సంజీవరాయుడు, సీనియర్ నాయకుడు భోగాతి బ్రహ్మానంద రెడ్డి మండిపడ్డారు. సోమవారం మండలంలోని కమలపాడు, చింతలాయపల్లిలో ఆయా గ్రామాల నాయకులతో కలిసి వారు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీలు, ఇప్పటి వరకు రాని పథకాలు, పథకాల ద్వారా కుటుంబాలకు రావాల్సిన నగదును ప్రజలకు వివరించారు. ప్రజలు సైతం తమకు పథకాలు ఇవ్వకుండా మోసం చేశారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు పేరం రామిరెడ్డి, బీసీ మల్లికార్జున, వాసుదేవ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, హరీష్‌రెడ్డి, కుటకుల మహేశ్వర రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మిద్దె జయుడు, గురురెడ్డి శంకర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

**సూపర్ సిక్స్ హామీలు షరతులు లేకుండా ఇవ్వాలి..**

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను షరతులు లేకుండా అందరికీ ఇవ్వాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం సాయంత్రం మండలంలోని మర్తాడు, కోటంక గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటనారాయణ, శింగనమల నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షుడు పుల్లారెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, యుగంధర్ రెడ్డి, తాతిరెడ్డి, సుబ్రహ్మణ్యం, గంగాధర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**పథకాల అమలులో అట్టర్ ఫ్లాప్..**

నార్పల: ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో అట్టర్ ఫ్లాప్ అయిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ పిలుపు మేరకు దుర్గం, సిద్దరాచర్ల, గొల్లపల్లి, బండ్లపల్లి,ఎస్.కొట్టాల గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో ఆయన ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలకు సంబంధించి క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. మండల కన్వీనర్ ఖాదర్‌వలీఖాన్, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, సర్పంచు రామాంజినేయులు, ఎంపీటీ శంకర్‌యాదవ్, నాయకులు రామోహన్‌రెడ్డి, సాకే పుల్లన్న, నారాయణస్వామి, మాధవ రెడ్డి, రవీంద్రరెడ్డి, దాసయ్య, శివయ్య, సూరప్ప, చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, పుల్లారెడ్డి, దేవా, రాజు తదితరులు పాల్గొన్నారు.

### నిజాయితీగా పనిచేయండి

గుంతకల్లుటౌన్: పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్నలను పొందాలని వన్‌టౌన్ సీఐ మనోహర్ సూచించారు. సోమవారం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే గ్రౌండ్‌లో కానిస్టేబుళ్లుగా ఎంపికైన యువతకు అభినందన సభ నిర్వహించారు. సివిల్ పోలీసులుగా ఎంపికైన వారికి శాలువా, పూలమాలలతో సత్కరించారు కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, కౌన్సిలర్ ఆంజనేయులు, సభ్యులు విజయ్, సుబ్బరాయుడు, నబిరసూల్, కాశీనాథ్, ట్రైనర్లు సంజీవరాయుడు, కిరణ్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

### హైవే దుస్థితిపై ఏఈకి వినతి

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద నుంచి రైల్వే బ్రిడ్జి వరకూ 67 జాతీయ రహదారి చాలా అధ్వానంగా మారిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని హైవే ఏఈ కోటేశ్వర్ రెడ్డికి గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ భాస్కర్ విన్నవించారు. విజయ భాస్కర్ సోమవారం అనంతపురం వెళ్లి నేషనల్ హైవే కార్యాలయంలో ఏఈని కలిసి వినతి పత్రం అందజేశారు. అసంపూర్తిగా ఉన్న నేషనల్ హైవే 67 ను వెంటనే పూర్తి చేయాలని, రోడ్డుకు కనీసం మరమ్మతులైనా చేపట్టాలని విన్నవించారు. అందుకు ఏఈ సానుకూలంగా స్పందించారన్నారు.

### ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరించాలి

పామిడి: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరించాలని ఆ సంస్థ అభిమానులు కోరారు. పామిడిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సేవ్ ఆర్డీటీపై ఆసంస్థ అభిమానుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్.రమేష్ బాబు, స్వామినాయక్, ఆర్. ధాకేనాయక్, ఎం.రమేష్‌నాయక్, నారాయణస్వామి తదితరులు మాట్లాడారు. పేదలకు విద్య, వైద్యం, ఆరోగ్యంతో పాటు ఎన్నో అభ్యున్నతి కార్యక్రమాలు చేపట్టిన ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రద్దు పరచడం శోచనీయమన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఉషారాణికి అందజేశారు. కార్యక్రమంలో బాలునాయక్, రామాంజనేయులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఇన్సూరెన్స్ కంపెనీల వివరాలు రైతులకు తెలియజేయాలి

పెద్దవడుగూరు: రైతులతో ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టించుకుంటున్న కంపెనీల వివరాలు తెలపాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దపప్పూరు ఆదినారాయణ, కత్తుల కొండయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు యూనియన్ బ్యాంకు వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా రైతుల నుంచి కట్టించుకున్న ఇన్సూరెన్స్ ప్రీమియం డబ్బులు ఏ కంపెనీకి వెళ్తున్నాయో రైతులకు తెలియజేయడం లేదన్నారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు రంగస్వామి, పెద్దులయ్య, అప్పేచర్ల రాజు, లాలెప్ప తదితరులు పాల్గొన్నారు.

### పీ కొత్తపల్లికి తాగునీరు

పామిడి: కొత్తపల్లిలో తాగునీటి సమస్యలను పరిష్కరించారు. పీ కొత్తపల్లిలో మళ్లీ నీటికష్టాలు అంటూ సోమవారం ప్రచురితమైన సాక్షి కథనంపై అధికారులు స్పందించారు. గ్రామంలోని ఓహెచ్ఆర్‌కు పెన్నా నది నుంచి మోటర్ ద్వారా తాగునీటిని పంపింగ్ చేశారు. గ్రామంలోని పబ్లిక్ ట్యాప్‌ల ద్వారా తాగునీటి సరఫరా చేసి నీటి సమస్యను తీర్చారు. ఇందుకుగా గ్రామస్తులు 'సాక్షి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### అన్నదానం

పుట్లూరు: మండలకేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదానం చేపట్టారు. గత 93 వారాలుగా ప్రతి సోమవారం ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నదానం చేపడుతున్నామని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ కుందు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దాతలు ఓబుళేషు, ఎంవీ సుబ్బయ్య, మూలి హరినాథరెడ్డి పాల్గొన్నారు.

## ప్రాణం పోసిన వైద్యుడికి సన్మానం


డాక్టర్ రాజేష్‌ను సన్మానిస్తున్న రైతు రామాంజనేయులు, కుటుంబ సభ్యులు

గుత్తి: తనకు ప్రాణం పోసిన వైద్యుడికి ఓ వ్యక్తి సన్మానం చేశారు. వివరాలు.. గుత్తి మండలం బేతాపల్లికి చెందిన రైతు రామాంజనేయులుకు గత నెల 15న గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్ రాజేష్ వెంటనే రామాంజనేయులుకు అతి ఖరీదైన ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. అనంతరం అనంతపురానికి రెఫర్ చేశారు. అనంతపురంలో స్టంట్ వేయించుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం రామాంజనేయులు తన కుటుంబ సభ్యులతో కలసి గుత్తి ప్రభుత్వాసుపత్రికి వెళ్లాడు. ప్రాణ భిక్ష పెట్టిన డాక్టర్ రాజేష్‌తో పాటు సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప, వైద్యులు మండ్ల వెంకట రమణ, చైతన్య తదితరులను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. తన కుటుంబం జీవితాంతం వైద్యలకు రుణపడి ఉంటామన్నారు.

## స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగులగొడతాం


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

గుత్తి: విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగులగొడతామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు హెచ్చరించారు. గుత్తిలోని నిజామీ ఫంక్షన్ హాల్లో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లపై రాష్ట్ర స్థాయి చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే రూ. 5 వేలు వచ్చే నెలసరి బిల్లు రూ. 20 వేల వరకూ పెరిగే అవకాశముందన్నారు. అందుకోసమే తాము స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీతో ఒప్పందం చేసుకుని విద్యుత్ వినియోదారులను నట్టేట ముంచాలని ప్రయత్నిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామంటే పగలగొడతామని ప్రగల్బాలు పలికిన కూటమి నాయకులు ఇపుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలకు తిలోదకాలు ఇచ్చి పాలన పట్ల దృష్టి సారించాలని హితవు పలికారు. రాష్ట్రంలో కార్మిక, కర్షక, రైతు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. వారి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్, అనంతపురం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, సీనియర్ నాయకులు రామకృష్ణ, రేణుక, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాల కార్యాచరణకు ప్రణాళికలు

బుక్కరాయసముద్రం: ప్రజా సమస్యలు పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి ప్రక్కన ఉన్న వాల్మీకి కల్యాణ మండపంలో సీపీఐ 9వ మహాసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మండలంలో ఉపాధి పథకంలో జరిగిన అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పార్టీ మండల కమిటీ ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా బండి రామక్రిష్ణ, సహాయ కార్యదర్శిలుగా రామాంజనేయులు, ఆనంద్, ఎన్నికయ్యారు. అలాగే 33 మందిని కౌన్సిల్ సభ్యులుగా, 19 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజక వర్గం కార్యదర్శి టి. నారాయణస్వామి, మధు యాదవ్, మద్రిస్వామి, తిరుపతయ్య, సుంకన్న, శ్రీనివాస్, కర్ణ, హరిక్రిష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలను నమోదు చేసుకోవాలి

శింగనమల: శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం మండలాల్లో ఉద్యాన పంటలను సాగు చేసిన రైతులు పంట నమోదు చేసుకోవాలని ఉద్యాన అధికారి శైలజ కోరారు. సోమవారం మండలంలోని సోదనపల్లిలో ఉద్యాన పంటల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదు ఆధారంగా ప్రభుత్వం ద్వారా పంటల బీమా, పంట నష్ట పరిహారం వంటి పథకాలు లబ్ధి పొందడానికీ వీలుగా ఉంటుందన్నారు. వర్షపాతం తక్కువగా ఉంటే పంటలను నీటి ఎద్దడి నుంచి సంరక్షించుకోవడానికి ఉద్యాన శాఖ ద్వారా ఫారం పాండ్ నిర్మాణానికి 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. అలాగే పంట దిగుబడులను నిల్వ చేసుకోవడానికీ ప్యాక్ హౌస్‌లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది మునికుమార్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు పురస్కారం


తేరన్నపల్లిలో విద్యార్థినికి నగదు అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: మండలంలోని తేరన్నపల్లి, యర్రగుంటపల్లి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరిక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తాడిపత్రి పెన్షనర్ల సంఘం సభ్యులు సోమవారం నగదు పురష్కారాలు అందజేశారు. తేరన్నపల్లిలో విద్యార్థిని ఫర్జానాకు రూ.5 వేలు, దీక్షితకు రూ.3 వేలు, అఫ్రీన్‌కు రూ.2 వేల నగదును రిటైర్డ్ హెచ్ఎం తిరుపాలు ఆర్థిక సాయంతో అందజేసారు. అలాగే యర్రగుంటపల్లిలో విద్యార్థిని నిఖితకు రూ.5వేలు, లక్షయకు రూ.3 వేలు, అఖిలకు రూ.2వేలు అందజేసారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రంగనాథ్, దేవి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, వీరారెడ్డి, అశ్వత్థరెడ్డి, ఆదినారాయణస్వామి, నారాయణరెడ్డి, సుబ్బన్న, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరామయ్య సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సెల్‌ఫోన్లు వెనక్కి..

- పని ఒత్తిడితో అంగన్‌వాడీల నిర్ణయం

తాడిపత్రి రూరల్: ప్రాజెక్టు పరిధిలో 90 శాతం మంది అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లను ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం అప్పగించారని సీడీపీఓ సాజిదాభేగం తెలిపారు. వివిధ రకాల యాప్‌ల వల్ల పని ఒత్తిడి ఎక్కువగా ఉండటం, నెట్ 2జీ ఉండటం వల్ల ఎదురువుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుకొని సెల్‌ఫోన్లను టీచర్లు వెనక్కు ఇచ్చారన్నారు. ప్రాజెక్టు పరిధిలో 302 సెంటర్లు ఉండగా రాయలచెరువు సెక్టార్‌లోని కొందరు మాత్రమే సెల్‌ఫోన్లను తిరిగి ఇవ్వలేదన్నారు. యాప్‌ల ప్రకారం పనిచేస్తామని తెలిపారన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సెల్‌ఫోన్లను వెనక్కి ఇచ్చారన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని సీడీపీఓ తెలిపారు.

### వరుణుడి కరుణ కోసం పల్లెబాట


వర్షం కోసం భజన చేస్తూ పల్లెబాట పట్టిన పెద్దవడుగూరు రైతులు

పెద్దవడుగూరు: పంటలు ఎండుముఖం పడుతుండటంతో రైతులు కరుణించవా... వరుణదేవా... అంటూ భక్త మార్గంలో పల్లెబాట పట్టారు. పెద్దవడుగూరుకు చెందిన కొందరు రైతులు, వర్షం కోసం భక్తి గీతాలు పాడుతూ మేడిమాకులపల్లి, లక్ష్మంపల్లి, మల్లేనిపల్లి, జి.వెంకటాంపల్లి, ఆవులాంపల్లి గ్రామాలు తిరిగారు. సాయంత్రంలోపు స్వగ్రామానికి చేరుకుని గ్రామంలోని దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### అనారోగ్యంతో వీఆర్ఏ మృతి


రామకృష్ణ(ఫైల్)

యాడికి: మండలంలోని తూట్రాళ్లపల్లి వీఆర్ఏ రామకృష్ణ సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వోలు నాయుడు, ఆంజనేయులు ఆ గ్రామానికి వెళ్లి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం మృతుడి కుటుంబీకులకు రూ.15 వేలు ఆర్థికసాయం చేశారు. అనంతరం సర్పంచు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు తదితరులు మృతదేహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కాగా మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### పీహెచ్‌సీ వైద్యుడి బాధ్యతల స్వీకరణ


డాక్టర్ ఉదయ్

గార్లదిన్నె: గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడిగా ఉదయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగసముద్రం గేట్ పీహెచ్‌సీ నుంచి బదిలీపై గార్లదిన్నె పీహెచ్‌సీకి వచ్చానన్నారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ గౌతమి వైఎస్సార్ జిల్లా లింగాల పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారన్నారు. గార్లదిన్నె పీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందిస్తానన్నారు.

### ఆటోలో నుంచి పడి వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని మోడల్ స్కూల్ వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో నుంచి జారి కింద పడి రాము అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్యాపిలికి చెందిన రాము పని మీద గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని ఆటోలో వెనుక కూర్చొని వెళుతుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో కుదుపునకు గురైంది. దీంతో రాము జారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.